క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



శివాలయంలో హోమం చేస్తున్న సర్పంచు దంపతులు

మహేశ్వరం: అమీర్‌పేట్‌లోని పురాతనమైన గణపతి, నంది పార్వతీ, నాగదేవత శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు రెండోరోజైన శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పాతకాల పూజలు, వేదపారాయణం, హోమాలు, మూలమంత్ర జపాలు, అభిషేకం, ధ్యాన్యా ధివాసం, హారతి తీర్థ ప్రసాదం, సాయంత్రం 4 గంటలకు 108 కలశాల విశేష మహాన్యాసం తో పాటు పలు పూజా కార్యక్రమాలు భక్తులు భక్తి శ్రద్ధలతో చేశారు. కార్యక్రమంలో సర్పంచు బస్వ శ్రీశైలం గౌడ్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

రుణమాఫీకి అరకొర నిధులు

కాంగ్రెస్ పార్టీ మైనార్టీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అఫ్జల్‌బేగ్



కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023–24 బడ్జెట్‌లో రుణమాఫీ పథకానికి అరకొర నిధులు కేటాయించి చేతులు దులుపుకోవడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎండీ.అఫ్జల్‌బేగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018 డిసెంబర్ నాటికి వివిధ బ్యాంకుల్లో రైతుల బకాయిలు రూ.24,738 కోట్లు ఉండగా.. కేవలం రూ.6385 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఇప్పటివరకు రెండు దఫాల్లో కేవలం రూ.763 కోట్లు మాత్రమే మాఫీ చేశారన్నారు. అన్నదాతలకు రూ.లక్ష వరకు రుణ మాఫీ చేస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో వెంటనే బడ్జెట్‌లో రుణమాఫీ కింద అదనంగా కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు.

దీన్‌దయాల్ సేవలు చిరస్మరణీయం

బీజేపీ నేత అందెల శ్రీరాములు



దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

తుక్కుగూడ: దేశంలో జాతీయ భావాన్ని పెంపొందించిన మహనీయుడు దీన్‌దయాల్ ఉపాధ్యాయ అని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్జి అందెల శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. శనివారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో దీన్‌దయాల్ వర్ధంతిని బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంత్యోదయ పథకము ద్వారా చిట్టచివరి పేదవాడికి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని ఆకాంక్షించిన వ్యక్తి దీన్‌దయాల్ అన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, కౌన్సిలర్లు రాజమౌని రాజు, నాయకులు రాజు, సుధాకర్, బాలరాజ్, ఆంజనేయులు, రవినాయక్, రాజు, నరేందర్, అంబోజీ శ్రీను పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 17, వంకాయ 23, బెండ 55, పచ్చి మిర్చి 35, కాకర 37, బీర 45, క్యాబేజి 9, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 18, దొండ 28–33, చిక్కుడు 45, గోకర 40, బీట్‌రూట్ 15, క్యాప్సికం 50, ఆలు 19, దోస 23, సొర 15, పొట్ల 18, ఉల్లి 16. చామగడ్డ 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఐటీయూ నేతలు

మంచాల: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపడుతున్న పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో పాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం నుంచి పాలకుర్తి నుంచి పాదయాత్రను ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ప్రధానంగా పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ పోరాటం సాగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. పంచాయతీ కార్మిక సంఘం నాయకులు పాండు, మాధవి, అర్జున్, శ్రీను, లక్ష్మమ్మ, యాదయ్య పాల్గొన్నారు.

అనుమతులు జాన్తా నై

- మున్సిపాలిటీ పరిధిలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు
- పాత గ్రామ పంచాయతీ పేరుతో అనుమతి పత్రాలు చూపుతున్న నిర్మాణదారులు
- అధికారుల సహకారంతోనే అంటూ ఆరోపణలు!
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



తుక్కుగూడ ప్రధాన రోడ్డుపై అనుమతులు లేని కట్టడాలు

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాల నిర్మాణం యథేచ్ఛగా జరుగుతోంది. అనుమతులు జాన్తానై అంటూ అక్రమార్కులు నిర్మాణాలు చేపడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తుక్కుగూడ, రావిర్యాల, మంఖాల్, ఇమామ్‌గూడ, సర్దార్‌నగర్, దేవేందర్‌నగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో బహుళ అంతస్తులు, భవనాలు, శ్రీశైలం జాతీయ రహదారి, నెహ్రూ ఔటర్ రింగు రోడ్డుకు ఇరువైపులా షెడ్లు నిర్మిస్తున్నారు అక్రమార్కులు. మున్సిపల్ అధికారుల అనుమతులతో సంబంధం లేకుండా ఇప్పటికీ పాత గ్రామ పంచాయతీ అనుమతులతో నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే ఆయా నిర్మాణాల వైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడం పట్ల పలు అనుమానాలు, విమర్శలు వెలువెత్తుతున్నాయి.

భూముల ధరలకు రెక్కలు..

తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో.. శ్రీశైలం జాతీయ రహదారి, ఔటర్ రింగు రోడ్డు, రాజీవ్‌గాంధీ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్, హర్షువేరు పార్కు, మంఖాల్ పారిశ్రామికవాడ, ఈ–సిటీ తదితర పరిశ్రమలు, వండర్‌లా వంటివి ఉండటంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో అనుమతులు తీసుకోవాలంటే ప్రభుత్వానికి లక్షల రూపాయాలు చెల్లించాల్సి వస్తుందని కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు చేపడుతున్నారు. మున్సిపల్ పరిధిలో జీప్లస్ టూ అనుమతులు మాత్రమే ఇవ్వాలి. అంతకంటే ఎక్కువ కట్టుకోవాలంటే హెచ్ఎండీఏ నుంచి అనుమతి పొందాలి. కానీ మున్సిపాలిటీ పరిధిలో నాలుగు, ఐదు అంతస్తులతో పాటు పెంట్‌హౌస్ నిర్మాణాలు కూడా చేపడుతున్నారు. చాలామంది గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు తాము బహుళ అంతస్తులకు అనుమతులు తీసుకున్నామని చెబుతున్నారు. గ్రామ పంచాయతీల పాలనపోయి మున్సిపాలిటీలో దాదాపుగా నాలుగు సంవత్సరాలు దాటుతున్నా ఇప్పటికీ అవే అనుమతులు జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

శ్రీశైలం రహదారిపై షెడ్ల నిర్మాణం..

మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీశైలం జాతీయ రహదారిపై కొందరు వ్యాపారాలు అక్రమంగా షెడ్లను నిర్మిస్తున్నారు. ఈ రోడ్డులో ఉన్న చాలావరకు భూములు గృహ నిర్మాణ రంగం జోన్‌లో (రెసిడెన్షియల్) లేవు. దీంతో ఎలాంటి అనుమతులు, పత్రాలు లేకుండానే వందల గజాలా భూమిలో పెద్ద, పెద్ద షెడ్లను నిర్మించి ఫంక్షన్‌హాల్స్, హోటళ్లు, లాడ్జిలు, బార్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మున్సిపాలిటీలో ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కేవలం నోటీసులు ఇచ్చి సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల మున్సిపాలిటీకి బదిలీపై వచ్చిన ఓ ఉన్నతాధికారి మున్సిపాలిటీ సిబ్బందిలో కొంతమందిని టీమ్‌గా ఏర్పాటు చేసి అక్రమ భవనాలు, షెడ్లను గుర్తించి వారికి నోటీసులు ఇచ్చి.. తెరవెనుక లక్షల రూపాయాలను వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

“అనుమతులు తీసుకోవాలి



మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణలతో పాటు షెడ్లను గుర్తించి వాటికి నోటీసులు జారీ చేస్తున్నాము. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ అనుమతులు తీసుకున్న తర్వాతే నిర్మాణాలు చేపట్టాలి.

– వెంకట్రామ్, మున్సిపల్ కమిషనర్, తుక్కుగూడ

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

సైకాలజిస్ట్‌లు కృష్ణభరత్, ఫణిపవన్



అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్ కృష్ణభరత్

మీర్‌పేట: విద్యార్థులు పరీక్షలు రాసేటప్పుడు ఒత్తిడికి లోనవకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని ప్రముఖ సైకాలజిస్టులు కృష్ణభరత్, ఫణిపవన్‌లు విద్యార్థులకు సూచించారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని లార్డ్స్ పాఠశాలలో 'లార్డ్స్ విజయీభవ' పేరిట 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం సాయంత్రం పరీక్ష రాసే విధానంపై వారు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కృష్ణభరత్, ఫణిపవన్‌లు మాట్లాడుతూ.. పరీక్ష రాసే విధానంలో తప్పులు దొర్లకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, తమకు ఏదీ రాదని నిరుత్సాహ పడకుండా ప్రయత్నం చేయడమే ఉత్తమమైన విద్యార్థి లక్షణమని వివరించారు. అలాగే సమయ పాలన పాటిస్తూ పరిసరాలను అర్థం చేసుకుంటూ ప్రశాంతంగా పరీక్షలు రాసే ప్రయత్నం చేయాలని విద్యార్థులకు తెలిపారు. అనంతరం లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్, వైస్ చైర్మన్ సిద్దాల బీరప్ప, శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ఇష్టపడి చదివితే విజయం తప్పక వరిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించడానికి ఎంతో కష్టపడతారని, వారి కష్టాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు బాగా చదవాలని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీలత, ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



వీరాంజనేయ స్వామి ఆలయంలో భక్తుల సందడి

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి, అమీర్‌పేట్ గ్రామంలో సీతారాంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయాల్లో స్వామివారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం, పుష్పాలంకరణతో పాటు తమలపాకులతో అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో దంపతులు శ్రీసత్యనారాయణ వ్రతాలు చేశారు. శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాసరావు, ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమీర్‌పేట్ ఆంజనేయ స్వామి ఆలయ పూజారి తొండుపల్లి సంతోష్ శర్మ, వీరేశం, ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్య ముదిరాజ్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

వడ్డెరలను అడ్డుకోవడం దుర్మార్గం

సంఘం మండల అధ్యక్షుడు యాదయ్య



బాలాపూర్ పీఎస్‌లో వడ్డెర నాయకులు

బడంగ్‌పేట్: హక్కుల కోసం పోరాడుతున్న వడ్డెర జాతుల కులస్తులను అడ్డుకొని నిర్బంధించడం దుర్మార్గపు చర్య అని బాలాపూర్ మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు గండికోట యాదయ్య అన్నారు. శనివారం రాష్ట్ర వడ్డెర సంఘం పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నాకు సిద్ధమైన వడ్డెర కులస్తులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. మునుగోడు ఎన్నికల సందర్భంగా బీసీ–ఏలో ఉన్న వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ ఇంత వరకు అమలు చేయలేదని విమర్శించారు. బాలాపూర్ మండలంలోనే సుమారు 6వేల కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని కేటీఆర్.. పోలీసులను అడ్డం పెట్టుకుని ముందస్తు అరెస్టులు చేయడం తగదన్నారు. అరెస్టులకు భయపడబోమని పోరాటాలతో తమ హక్కులను సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు మంజుల భీమయ్య, నర్సింహ, గోపి, బాలు, చిన నర్సింహ, రంగయ్య, యాదయ్య, కొండల్, అంజయ్య, వెంకటేష్, నర్సింహా, రమేష్, శివ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయ నిర్మాణానికి సహకారం

మేయర్ చిగురింత పారిజాత



గిరిజన నాయకులకు చెక్కు అందజేస్తున్న మేయర్ పారిజాత

మహేశ్వరం: నియోజకవర్గంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జగదాంబ దుర్గ భవానీ ఆలయం నిర్మాణానికి తమవంతుగా సహకారం చేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ నగర మేయర్ చిగురింత పారిజాత పేర్కొన్నారు. శనివారం మండలంలోని గిరిజన నాయకులు ఆమెను వారి నివాసంలో కలిసి, ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరడంతో వెంటనే స్పందించి రూ.5 లక్షల చెక్కును కమిటీ సభ్యులకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దాతల సహకారంతో గిరిజన బంజారుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జగదాంబ దుర్గ భవానీ ఆలయం నిర్మాణం చేయడం అభినందనీయమన్నారు. సేవాలాల్ ఆలయ నిర్మాణంలో తాను భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందన్నారు. సామాజిక సేవే లక్ష్యంగా తాను నిరంతరం కృషి చేస్తామన్నారు. అంతకు ముందు ఆమెకు ఆలయ ఆహ్వాన పత్రికను అందజేశారు. విరాళం అందజేసిన పారిజాతనర్సింహారెడ్డికి గిరిజన నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీసంత్‌సేవాలాల్ మహారాజ్ ఆలయ కమిటీ చైర్మన్ సీతారామ్ నాయక్, మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాజునాయక్, గిరిజన నాయకులు అంగోత్ కృష్ణనాయక్, పాండు నాయక్, దేశ్యానాయక్, రతన్‌నాయక్, కాట్రావత్ కృష్ణనాయక్, లక్ష్మణ్ నాయక్, గోవిందా, గాన్సీరామ్, ధశరత్ నాయక్, సేనావత్ బాలునాయక్ పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారమే లోక్ అదాలత్ లక్ష్యం

- పరస్పర అమోదంతో న్యాయం
- న్యాయమూర్తి ఫర్హీన్ కౌసర్
- 1,737 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి ఫర్హీన్ కౌసర్

మహేశ్వరం: పెండింగ్ కేసుల పరిష్కారమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాల పరస్పర అమోదంతో సత్వర న్యాయం జరుగుతుందని న్యాయమూర్తి ఫర్హీన్ కౌసర్ అన్నారు. శనివారం మహేశ్వరం న్యాయస్థానంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు. అనంతరం జడ్జీ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పేరుకుపోయిన కేసుల పరిష్కారానికి ఇది చక్కటి వేదిక అని, దీనిపై కక్షిదారులు అవగాహన పెంచుకొని, కేసులను సయోధ్యతో పరిష్కార మార్గం ఎంచుకోవడం ఉత్తమమని చెప్పారు. కక్షిదారులు వివాదాలు పెంచుకొని సమయం వృథా చేసుకోరాదని సూచించారు. లోక్ అదాలత్‌లో సివిల్, ప్రమాద బీమా, రుణాల రికవరీ, చిట్‌ఫండ్ కేసులు, కుటుంబ వివాదాలు, ఫోన్ బకాయిలు, అబ్కారీ, క్రిమినల్ కేసులను పరిష్కరిస్తారని ఆమె వెల్లడించారు. కక్షిదారులకు ముందుగానే నోటీసులు జారీ చేసి లోక్ అదాలత్‌కు పిలుస్తామని తెలిపారు. సీసీ కేసులు–97, ఈ–పెట్టి కేసులు–1,635, క్రైమ్–5 కేసులను పరిష్కరించి రాజీ చేశామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమేష్ బాబు, కోర్టు సూపరిండెండెంట్ కల, మహేశ్వరం, కందుకూరు సీఐలు మధుసూదన్, కృష్ణంరాజు, మహేశ్వరం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్ గౌడ్, లోక్ అదాలత్ సభ్యులు అశోక్, సుభాష్ చంద్రారెడ్డి, న్యాయవాదులు ఎండీ నజీర్ పాషా, శ్రీపాల్‌రెడ్డి, రాజేష్ గౌడ్, కిషన్, చంద్రకాంత్, కోర్టు బెంచ్ క్లర్క్ శంకర్, జూనియర్ అసిస్టెంట్ సమీర్, పలువురు న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

ఆటో డ్రైవర్లకు పోలీసుల అవగాహన



ఆటో డ్రైవర్లను సన్మానిస్తున్న పోలీసులు

కందుకూరు: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఐ కృష్ణంరాజు సూచించారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు.. ట్రాఫిక్, యాక్సిడెంట్లు, సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు నిత్యం రోడ్డు ప్రమాదాల బారిన ప్రజలు పడుతున్నారని.. డ్రైవింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ వాహనం, పోలీసులకు సమాచారం అందించి ప్రాణాలను కాపాడాలన్నారు. అందుకు డ్రైవర్ల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ఇన్సూరెన్స్, వాహన ఫిట్‌నెస్ సకాలంలో చేయించుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కాగా అత్యవసర సందర్భాల్లో పోలీసులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న ఆటో డ్రైవర్లు యాదయ్య, సదానంద్‌తో పాటు తన ఆటోలో ప్రయాణికులు వదిలేసిన నగదును తెచ్చి ఇచ్చిన మరో డ్రైవర్ జహంగీర్‌ను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రావణ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే పల్లె, పట్టణాల అభివృద్ధి

యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



జాపాలలో వృద్ధురాలి సమస్యలు వింటున్న ప్రశాంత్‌కుమార్ రెడ్డి

మంచాల: గ్రామీణ, పట్టణ ప్రాంతాలను పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో అభివృద్ధి పర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంచాల మండలంలోని జాపాల, కాగజ్‌ఘాట్ గ్రామాల్లో శనివారం ప్రగతి నివేదిన పాదయాత్ర కొనసాగింది. ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డితో మాట్లాడి స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మంచాల ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, మండల అధ్యక్షుడురమేష్, ప్రధాన కార్యదర్శి బహదూర్, నాయకులు జ్ఞానేశ్వర్, రాంరెడ్డి, సికిందర్‌రెడ్డి, దండేటికార్ రవి, వెంకటేష్, కిషన్‌రెడ్డి, శ్రీశైలం, పీఏసీయస్ వైస్ చైర్మన్ యాదయ్య, డైరెక్టర్ స్వరూప, ఏఎంసీ డైరెక్టర్లు జానీపాష, యాదయ్య, సర్పంచ్ జగన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాలకు తరలిరండి



గిరిజనులతో మాట్లాడుతున్న పత్యానాయక్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఈనెల 15న నిర్వహించే సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పత్యానాయక్, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ కోరారు. ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డతండా, శంకరకొండ తండా, కొత్తకుంటతండా, సాకిబండతండా, నుచ్చుగుట్టతండా, సీతారాంనగర్‌తండా, రాంనుంతల తండా, విఠాయిపల్లి తండా, చంద్రాయణపల్లి తండాల్లో శనివారం వారు పర్యటించారు. గిరిజనులతో సేవాలాల్ జయంతి వేడుకల గురించి వివరించారు. జయంతి వేడుకలకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు అమర్‌సింగ్, ఈశ్వర్‌నాయక్, శ్రీను నాయక్, గిరిజన సంఘం నాయకులు ప్రశాంత్‌నాయక్, మల్లేశ్‌నాయక్, హేమానాయక్, శంకర్, రైసల్‌నాయక్, సోమ్లానాయక్, పాండునాయక్, రాములునాయక్, సురేశ్, నానునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఐ ఉపేందర్‌కు సత్కారం

ఆమనగల్లు: ఆమనగల్లు సీఐ జాల ఉపేందర్‌ను బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో శనివారం సీఐ జాల ఉపేందర్‌ను బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర సెలక్షన్ కమిటీ చైర్మన్ మల్లేశ్ గౌతమ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు జోగు రమేశ్, నాయకులు గౌతమ్, కావలి రాములు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి: జెడ్పీటీసీ

మంచాల: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి నోముల గ్రామంలోని జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల వార్షికోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. ఈ పోటీ ప్రపంచంలో కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ ఉందన్నారు. ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మల్లయ్య బట్టు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు మంచి బోధన అందజేస్తున్నామన్నారు.అనంతరం జెడ్పీటీసీ నిత్యారెడ్డిని ఘనంగా సన్మానించారు. మంచాల ఎంపీడీఓ శ్రీనివాస్, సీఐ రవికుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- వెంకటాపూర్‌లో ఘనంగా బోనాలు



కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

తలకొండపల్లి: భక్తితో ముక్తి, మోక్షం లభిస్తుందని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో శనివారం కోట మైసమ్మ అమ్మవారి ఆలయంలో బొడ్రాయి ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్ రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మా సత్యం, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వారిని సాదరంగా ఆహ్వానించి స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహిళలు బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పయ్యావుల రమేష్‌యాదవ్, ఎంపీటీసీ సునీత, దర్శన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబర్ రహ్మాన్, మాజీ ఎంపీపీ సీఎల్.శ్రీనివాస్‌యాదవ్, ఆలయ చైర్మన్ శేఖర్‌గౌడ్, రాఘవేందర్ యాదవ్, ఆంజనేయులుగౌడ్, రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బొక్కల కంపెనీని మూసేయండి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్

యాచారం: కొత్తపల్లి గ్రామంలోని బొక్కల కంపెనీని వెంటనే మూసేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. గ్రామంలోని బొక్కల కంపెనీని శనివారం సందర్శించి నిరాహార దీక్ష చేస్తున్న గ్రామస్తులకు సంఘీభావం తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఫీడ్ కంపెనీ అనే పేరు పెట్టి కళేబరాలతో నూనె తయారు చేస్తున్నా.. అధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి, నాయకులు సంజీవ, కొత్తపల్లి ఉప సర్పంచ్ జగన్, విప్లవ్‌కుమార్, శ్రీనువాస్‌రెడ్డి, జంగయ్య, శ్రీనువాస్‌గౌడ్, సత్యానారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.